సాక్షి గుంటూరు

శనివారం । 17 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ శుక్రవారం సాయంత్రానికి 44.85 టీఎంసీలకు చేరింది. దిగువకు రెండు గేట్ల ద్వారా 57737 క్యూసెక్కులు వదిలారు.



సామూహిక వరలక్ష్మి వ్రతం

పిట్టలవానిపాలెం: చందోలులోని శ్రీ బగళాముఖి శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ వరలక్ష్మీదేవిగా అలంకరించారు. సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7,814 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

అన్న క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి లోకేష్



తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా నులకపేటలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో క్యాంటీన్‌ను ప్రారంభించి, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడివాడలో క్యాంటీన్‌ను ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 33 మున్సిపాలిటీల్లో 100 క్యాంటీన్‌లను పేద ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. దానిలో భాగంగానే మంగళగిరి నియోజకవర్గంలో 2 క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. నగర పంచాయతీల్లో 185 క్యాంటీన్లను అక్టోబర్ 2 నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు నందం అబద్ధయ్య, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, జిల్లా నాయకులు పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం



తెనాలి: పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని మూడు అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమయ్యాయి. మున్సిపల్ మార్కెట్, ప్రభుత్వ వైద్యశాల వద్ద మార్కెట్ యార్డు సమీపంలో, ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఉన్న కాంటీన్ల రెనోవేషన్‌ను పూర్తి చేసిన నేపథ్యంలో శుక్రవారం వాటిని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కలిసి ప్రారంభించారు. సౌకర్యాలను పరిశీలించి, అక్కడే అల్పాహారం చేశారు. కాకతీయ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు క్యాంటీన్ నిర్వహణకు రూ.10 లక్షలను చెక్కు రూపంలో అందజేశారు. మరికొందరు తమ విరాళాలను ప్రకటించారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఎస్పీ బి.జనార్దన రావు, మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీ బదిలీ

నగరంపాలెం: గుంటూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కే ఈశ్వర రావును సీఐడీ ఎస్పీ (ఎన్‌సీ)గా బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఆయనకు స్థానచలనం కలిగింది. గుంటూరు క్రైం ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావును ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ సీటీఎఫ్ అదనపు డీసీపీగా బదిలీ చేశారు.

తూర్పు సబ్ డివిజన్ ఏఎస్పీ బదిలీ



నగరంపాలెం: గుంటూరు తూర్పు సబ్ డివిజన్ ఏఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పది మంది ఐపీఎస్‌లను బదిలీ చేశారు. ఈ మేరకు షెల్కే నచికేత్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన ఏడాదిన్నర క్రితం ఇక్కడికొచ్చారు. జిల్లాలో సంచలనం రేకెత్తించిన కేసుల్లోనూ ప్రత్యేక దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ సిబ్బందితో కలిసి సమర్థంగా విధులు నిర్వహించారు.

76,970 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,25,914 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 76,970 హెక్టార్లలో సాగయ్యాయి. జూన్ మూడో వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 63,733 హెక్టార్లు ఉండగా, 49,270 హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేశారు. పత్తి 26,982కుగాను 18,927 హెక్టార్లలో సాగైంది. కంది 30, మొక్కజొన్న 23, పెసర 22, మినుము 554, వేరుశనగ 67, నువ్వులు 262, చెరకు 20, జూట్ 278, పసుపు 1101, టమాటా 1151, కూరగాయలు 1714, పచ్చిరొట్ట 3393 హెక్టార్లలో సాగయ్యాయి. మిరప సాధారణ విస్తీర్ణం 20,625 హెక్టార్లకుగాను 158 హెక్టార్లలో సాగు చేశారు. మిరప సాగుకు సెప్టెంబర్ రెండో వారం వరకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.

తమ్ముళ్లకు పరమాన్నం!

- గుంటూరు జిల్లాలో 14 చోట్ల అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం
- పది ప్రాంతాల్లో అడ్డగోలుగా అంచనాలు పెంపు
- కాంట్రాక్టర్లకు సహకరించిన సంబంధిత అధికారులు
- రూ.లక్షల్లో తెలుగు తమ్ముళ్లకు లబ్ధి కలిగేలా పనులు

సాక్షి ప్రతినిధి – గుంటూరు, తెనాలి అర్బన్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్యాంటీన్లను పునరుద్ధరించాలని, ఆగస్టు 15వ తేదీలోగా సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వెంటనే మున్సిపల్ అధికారులు అంచనాలు సిద్ధం చేసి, నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేశారు. మొదట కొంత మొత్తం కేటాయించినా తర్వాత అంచనాలు పెంచుకుంటూ పోయారు. తెలుగు తమ్ముళ్ల జేబులు నింపుకోవడం కోసమే ఈ తంతు అడ్డగోలుగా సాగింది.

కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కు

అంచనాల్లోనే అవినీతి పెద్ద ఎత్తున జరిగింది. ఇంజినీరింగ్ అధికారులు కూడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అంచనాలు రూపొందించారు. చిన్న మరమ్మతులు అవసరమైన చోట కూడా ఫ్లోరింగ్ పూర్తిగా మార్చడం, విద్యుత్ వైరింగ్ కొత్తగా వేయడం, పెయింటింగ్ వంటి వాటి పేరుతో అంచనాలు అడ్డగోలుగా పెంచేశారు. అసలు క్యాంటీన్‌కు ఇంత ఖర్చు కాదని తెలుగుదేశం పార్టీలోనే కొంతమంది నాయకులు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. గుంటూరు నగరంలో ఏడు చోట్ల క్యాంటీన్లకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వంతున ఖర్చు చేశారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి.

అన్న క్యాంటీన్లు కొత్తగా నిర్మించాల్సిన అవసరం లేదు... గతంలో ఉన్నవే. వాటికి కాస్త మరమ్మతులు చేసి పసుపు రంగు వేయడానికి పెంచేసిన అంచనాలు చూస్తే వాటితో కొత్త భవనాలే కట్టేయొచ్చని సామాన్యుడికి కూడా తెలుస్తుంది. తమ్ముళ్ల జేబులు నింపే పనిలో భాగంగానే ఈ తంతంగం చేశారని ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరు జిల్లాలో మొత్తం 14 క్యాంటీన్లు పునఃప్రారంభించారు. వీటిలో గుంటూరు నగరంలోని 7, తెనాలిలోని మూడు చోట్ల అడ్డగోలు అంచనాల పెంపుతో తెలుగు తమ్ముళ్లు జేబులు నింపుకొన్నట్లు సమాచారం.

డీటీసీ కార్యాలయం వద్ద రూ.8 లక్షలు



స్వర్ణభారత్ నగర్ డీటీసీ కార్యాలయం వద్ద క్యాంటీన్‌లో నూతనంగా ఎలక్ట్రిక్ వైరింగ్, లైట్లు, ఫ్యాన్లు, ఇతర పనుల నిమిత్తం రూ.8 లక్షలు ఖర్చు చేశారు.

అమరావతి రోడ్డులో రూ. 6.50 లక్షలు



అమరావతి రోడ్డు ఐడీ హాస్పిటల్ వద్ద క్యాంటీన్‌కు క్లాడింగ్, పెయింటింగ్, పార్కింగ్ టైల్స్, ట్యాపులు, ఎలక్ట్రికల్ వైరింగ్ చేసినందుకు రూ.6.50 లక్షలు ఖర్చు చేశారు.

చుట్టుగుంటలో రూ.15 లక్షలు

చుట్టుగుంట (అగ్రికల్చర్ కార్యాలయం) వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు రూ.15 లక్షలకుపైగా ఖర్చు చేశారు. ముందు రూ.10 లక్షలతో పెయింటింగ్, ఎలక్ట్రిక్ పనులు, టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణానికి నిర్ణయించారు. తరువాత అల్యూమినియం క్లాడింగ్ (ఎలివేషన్ వర్క్) చేర్చారు. దీంతో అదనంగా రూ.5 లక్షలతో నామినేషన్ పద్ధతిలో పనులు పూర్తి చేశారు.

రైతుబజార్ వద్ద రూ.14 లక్షలు

ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు రైతు బజార్ వద్ద ఉన్న క్యాంటీన్‌లో పెయింటింగ్, డోర్లు, టైల్స్, శానిటరీ వేర్, టేబుల్స్ రిపేర్లకు రూ.9.80 లక్షలు ఖర్చు చేశారు. దీంతో పాటు అదనంగా అల్యూమినీయం క్లాడింగ్ (ఎలివేషన్ వర్క్)కు రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించి పూర్తి చేశారు.

నల్లచెరువు రోడ్డులో రూ.9 లక్షలు



నల్లచెరువు రోడ్డులోని క్యాంటీన్‌లో పెయింట్, అల్యూమినియం క్లాడింగ్ (ఎలివేషన్ వర్క్), డోర్లు, టేబుల్స్, టైల్స్, ఎలక్ట్రిక్ పనులు చేసినందుకు రూ.9 లక్షలు ఖర్చు చేశారు.

తెనాలిలో ఖర్చు ఇలా..

తెనాలి మున్సిపాలిటీ పరిధిలోని మూడు అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమయ్యాయి.



మున్సిపల్ మార్కెట్‌లో రూ.35 లక్షలతో గతంలో నిర్మించారు. ఇప్పుడు మరమ్మతుల కోసం రూ.8 లక్షలు వెచ్చించింది. రంగులు, ఎలివేషన్, ప్లంబింగ్, లైటింగ్ పనులకు ఇంత ఖర్చు కాదనే ఆరోపణ వినిపిస్తోంది.



ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద రూ.35 లక్షలతో నిర్మించారు. మరమ్మతుల కోసం రూ.8 లక్షలు వెచ్చించారు. వివిధ రకాల పనులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



ప్రభుత్వ వైద్యశాల వద్ద మార్కెట్ యార్డు సమీపంలో రూ.35 లక్షలతో గత టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ భవనాన్ని నిర్మించింది. దీని మరమ్మతుల కోసం రూ.10 లక్షలను ఇప్పుడు మున్సిపల్ అధికారులు వెచ్చించారు. వాస్తవంగా అంత ఖర్చు కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పల్నాడు బస్టాండు రోడ్డు సమీపంలో రూ.10 లక్షలు



పల్నాడు బస్టాండ్ రోడ్డు వద్ద క్యాంటీన్ శుభ్రంగా ఉంది. గతంలో ఇక్కడ నగరపాలక సంస్థ ఏడీహెచ్ కార్యాలయం ఉండేది. ఇందులో పెయింటింగ్, టైల్స్, టాయిలెట్స్ రిపేర్, ఇతర పనుల పేరిట రూ.10 లక్షలు ఖర్చు చేశారు.

మిర్చియార్డు వద్ద రూ.10 లక్షలు



మిర్చియార్డు వద్ద ఉన్న క్యాంటీన్ ముందే భేషుగ్గా ఉంది. రంగులేసి కాస్త మెరుగులద్దితే సరిపోయేది. ఈ పనులకు అక్షరాలా రూ.10 లక్షలు ఖర్చు చేశారు.

పొన్నూరులో రూ.9.20 లక్షలు



గతంలో రూ.36 లక్షలతో పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ప్రస్తుతం రూ.9.20 లక్షలతో మార్పులు చేశారు. చిన్న చిన్న మరమ్మతులు మినహా పెద్దగా చేసిన పనులు ఏమీ లేవు. పెయింట్ మాత్రమే వేసి ఇన్ని లక్షల ఖర్చు చూపారు.





వరలక్ష్మీ.. వరములీయవమ్మా...

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్ అగ్రహారంలో శ్రీకన్యకాపరమేశ్వరి దేవి పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం చేశారు. వరములీయమని అమ్మవారిని వేడుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

పసుపు కొమ్ముల అలంకరణలో భ్రమరాంబ



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. గర్భాలయం, అంతరాలయంలో పసుపు కొమ్ముల దండలను అలంకరించారు. భక్తులు అన్నప్రాసనలు, నామకరణలు, అంత్రాలయ అభిషేకాలు, వాహనపూజలు జరిపించారు. పొంగలి నైవేద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి శ్రావణమాసం మూడో శుక్రవారం లక్ష మల్లెపూలతో అలంకరణ ఉంటుందని ఉప కమిషనర్ పేర్కొన్నారు. చివరి శుక్రవారం అమ్మవారిని లక్ష గాజులతో అలంకరిస్తామని తెలిపారు. అదేరోజు శ్రావణమాస ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని వివరించారు.

24 గంటలపాటు వైద్య సేవలు బంద్

ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్



మాట్లాడుతున్న డాక్టర్ నందకిషోర్. పక్కన డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్రరెడ్డి తదితరులు

గుంటూరు మెడికల్ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యను నిరసిస్తూ శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ చెప్పారు. శుక్రవారం గుంటూరులోని ఐఎంఏ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు. ఐఎంఏ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో తమను దైవంతో సమానమని కొనియాడారని చెప్పారు. అలాంటివారు నేడు విధుల్లో ఉండగా అత్యాచారం చేయడం అత్యంత దుర్మార్గమైన, హేయమైన చర్యగా పేర్కొన్నారు. వైద్యులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులు హాజరు కావాలన్నారు. జూనియర్ వైద్యురాలి భౌతికకాయానికి సైనికులకు ఇచ్చే గౌరవ వందనం ఇవ్వాలన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత మాట్లాడుతూ తాము ఇంట్లో కంటే ఆసుపత్రిలోనే ఎక్కువ సమయంలో గడుపుతున్నామన్నారు. శనివారం జరిగే సమ్మెకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలన్నారు. గుంటూరు లాడ్జిసెంటర్ నుంచి జీజీహెచ్ వరకు ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఐఎంఏ గుంటూరు కార్యదర్శి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ.. వైద్యులపై దాడులు జరిగితే శిక్షించాలని, ఏపీలోనే మొట్టమొదటిసారిగా 2008లో చట్టం తీసుకొచ్చారన్నారు. వైద్యులపై దాడులు జరగకుండా కేంద్రం కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, నిందితులకు కఠిన శిక్ష విధించాలన్నారు. శనివారం జరిగే నిరసన ర్యాలీకి వైద్యులతోపాటు నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, మెడికల్ సంబంధిత సిబ్బంది అంతా మద్దతు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. దంత వైద్యుల సంఘం నేతలు తమ మద్దతు ప్రకటించారు. సమావేశంలో ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ పద్మలత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ ఈదర కృష్ణమూర్తి, డాక్టర్ బి.వెంటేశ్వర రావు, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ చిలకా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్ల ఆస్తి..

సర్కారు స్పందన నాస్తి!

- ఆదేశాలివ్వడానికి ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం
- కార్పొరేషన్ స్థలంతో చిన్మయ విద్యాసంస్థల వ్యాపారం
- కోర్టును ఆశ్రయించిన డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు
- కార్పొరేషన్‌కు అనుకూలంగా న్యాయస్థానం తీర్పు
- జీవో రద్దు కోరిన కమిషనర్... స్పందించని సర్కార్
- శాశ్వత స్వాధీనానికి పావులు కదుపుతున్న యాజమాన్యం



చిన్మయ విద్యాసంస్థల కోసం లీజుకు తీసుకున్న కార్పొరేషన్ స్థలం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సుమారు రూ.వంద కోట్లకుపైగా విలువ చేసే ఆస్తిని కార్పొరేషన్ కాపాడుకుంటుందా? దీనికి ప్రస్తుత ప్రభుత్వం సహకరిస్తుందా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు వందకుపైగా మున్సిపల్ స్కూళ్లలో 20 వేల మందికిపైగా చదువుతున్నారు. వీరంతా ఇరుకు గదుల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో కాసు సాయమ్మ స్కూల్‌ను దేవాదాయ శాఖ స్థలంలో నిర్వహిస్తూ.. దానికి రూ.2.25 కోట్లు చెల్లించలేదని మున్సిపల్ కమిషనర్‌కు నెల రోజుల జైలు శిక్ష కూడా పడింది. మరోవైపు రూ.వందల కోట్ల విలువ చేసే స్థలాలను ఉచితంగా కేటాయించి.. కనీసం ఆస్తి పన్ను కూడా కట్టించుకోలేని దుస్థితిలో కార్పొరేషన్ ఉంది.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

ఇంత చేస్తున్నా కార్పొరేషన్‌కు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. 1981 నుంచి స్థలం పన్ను, ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లిస్తేనే కనీసం రూ.39 కోట్ల వరకు కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉంది. మున్సిపల్ అధికారులు కనీసం ఆస్తిపన్ను వసూలుకు ప్రయత్నం కూడా చేయలేదు. సేవ పేరుతో వ్యాపారం చేస్తున్న విషయాన్ని స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ అసోసియేషన్ నాయకులు 2013లోనే ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకోవాలని అప్పటి జిల్లా మంత్రికి వినతిపత్రం ఇవ్వడంతో ఆయన విద్యాసంస్థను స్వాధీనం



కార్పొరేషన్ స్థలంలోని కళ్యాణ మండపం

చేసుకోవాలని కమిషనర్‌కు లేఖ రాశారు. దీంతో 2015లో కార్పొరేషన్ ఆ సంస్థకు నోటీసులు ఇచ్చింది. దీంతోపై హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుంది. 2015 –22 వరకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ ఈ స్థలాన్ని కాపాడే ప్రయత్నం చేయలేదు. కౌంటర్ కూడా దాఖలు కాలేదు. కొత్త కౌన్సిల్ రావడంతో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు ఈ అంశాన్ని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. తర్వాత ఆయనే స్వయంగా కోర్టును ఆశ్రయించారు. ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించి కోర్టులో వాదించేలా చూశారు. దీంతో గత ఏడాది డిసెంబర్ 26న కోర్టు ఆదేశాలు ఇచ్చింది. మున్సిపల్ కమిషనర్ విద్యాసంస్థ వారిని పిలిచి మాట్లాడి వాదనలు విన్న తర్వాత నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పింది. ఇది జరిగి ఎనిమిది నెలలైంది. గత నెలలో మున్సిపల్ కమిషనర్ ఆ సంస్థకు స్థలం కేటాయిస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ సెక్రటరీకి లేఖ కూడా రాశారు. అక్కడి నుంచి వివరాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఫైల్ వచ్చినట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉండే యాజమాన్యం ఈ భూమిని దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్‌కు ఈ భూమి దక్కుతుందా.. లేదా.. అనే అనుమానం మొదలైంది. కోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలని, రూ. వంద కోట్లకుపైగా విలువైన కార్పొరేషన్ ఆస్తిని కాపాడాలని డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు డిమాండ్ చేశారు.

సేవల కోసం లీజుకు తీసుకుని..

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ట్రస్ట్ పేరుతో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని చెప్పడంతో గుంటూరు నగరంలోని అత్యంత విలువైన ప్రాంతమైన ఎస్‌వీఎన్ కాలనీలో 1981లో చిన్మయ ట్రస్టుకు నగరపాలక సంస్థ భూమిని కేటాయించింది. ఆ 3 ఎకరాల 31 సెంట్ల స్థలం విలువ ఇప్పుడు రూ.వంద కోట్లకు పైనే ఉంది. పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పకపోగా ప్రతి విద్యార్థి నుంచి ఫీజుల రూపంలో ఏడాదికి రూ.30 వేల వరకు ఇక్కడ వసూలు చేస్తున్నారు. లీజుకు తీసుకున్న ఏడాదిలోగా స్కూల్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, 1991లో ప్రారంభించారు. స్కూల్ ప్రాంగణంలో ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించి ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. గద్దె ఉమామహేశ్వరరావు పేరు పెట్టడానికి ఆయన సతీమణి నుంచి రూ.1.50 కోట్లను విరాళంగా తీసుకున్నారు. క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేసి అక్కడా వ్యాపారం చేశారు. ఇక్కడ హోంసైన్స్ పేరుతో కాలేజీ నిర్మాణం చేపట్టారు.

క్లుప్తంగా

రేపు వక్ఫ్ చట్టం సవరణలపై రాష్ట్ర స్థాయి సదస్సు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం సవరణల గురించి రాష్ట్రస్థాయి సదస్సు ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి అన్నారు. బ్రాడీపేట గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముస్లింలపై బీజేపీ ప్రభుత్వం ఆర్థిక దాడులు చేస్తూ వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని హరించేలా వ్యవహరిస్తోందన్నారు. ఈ విషయంలో కలెక్టర్లకు విచక్షణ అధికారాలు ఇవ్వడం సరి కాదన్నారు. ఈ చట్ట సవరణలు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. న్యాయ నిపుణులతో రాష్ట్ర సదస్సును 18వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు ఎస్కే బాషా, ఖాసిం వలి, సలీం, ఎస్కే సైదా తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.4700, మోడల్ ధర రూ.4000 వరకు పలికింది.

తల్లిని బెదిరించబోయి యువకుడి మృతి



ప్రత్తిపాడు: తల్లిని బెదిరించేందుకు గడ్డి మందు తాగిన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన ధర్నాసి కార్తీక్ (22) డిగ్రీ పూర్తి చేశాడు. పీజీ ఎంట్రన్స్ రాసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గత నెల 28వ తేదీన చర్చికి వెళ్లమని కార్తీక్‌ను తల్లి మందలించింది. ఆమె బెదిరించే క్రమంలో గడ్డి మందు తాగాడు. వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురైన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అమ్మవారి జన్మదిన వేడుకలు



తెనాలి: మండల పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవసేవ ఆలయంలో శ్రీసర్వదేవ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారి జన్మదిన వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బుర్రిపాలెం, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. 108 కలశాలతో కోలాటం నడుమ ఊరేగింపుగా చక్రాయపాలెం, బుర్రిపాలెం నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తిప్రపత్తులతో కలశ పూజలు చేశారు. అష్టలక్ష్మి పూజ నిర్వహించారు. భక్తులు తమ వెంట తెచ్చిన 108 ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం తెనాలిలోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

ప్రతి ఒక్కరితో గౌరవంగా మెలగాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి సూచన
- జూనియర్ సివిల్ జడ్జీలకు గుంటూరు బార్ అసోసియేషన్‌లో సత్కారం



ఆషాప్రియ, అపర్ణలను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నగరంపాలెం: ప్రతి ఒక్కరిని గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా స్పెషల్ మొబైల్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన మున్నంగి ఆషాప్రియ, కర్నూలు జిల్లాలోని ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)- కమ్ -1 అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువెనైల్ కోర్టు) నియమితులైన గొంటు అపర్ణను ది గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కోర్టులోని హాల్‌లో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ ఎవర్నీ ఇబ్బందులకు గురిచేయవద్దని పేర్కొన్నారు. అందరితో గౌరవంగా మెలగాలని అన్నారు. ప్రతి ఒక్కరి బాధలను ఆలకించాలని చెప్పారు. కోర్టు సిబ్బంది, కక్షిదారులను బాధ పెట్టవద్దని సూచించారు. జూనియర్, సీనియర్ న్యాయవాదులను గౌరవించాలని చెప్పారు. కోర్టులకు వచ్చే మహిళల బాధలను అర్థం చేసుకోవాలని కోరారు. యువ న్యాయమూర్తులు జీవితంలో మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. తెలిసి ఏ తప్పు కూడా చేయవద్దని అన్నారు. మంచి తీర్పులను వెలువరించాలని కోరారు. సన్మానగ్రహీతలైన మున్నంగి ఆషాప్రియ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి బార్ అసోసియేషన్‌తో అనుబంధం ఉందని అన్నారు. తండ్రి సాంబిరెడ్డి సీనియర్ న్యాయవాది కావడంతో చిన్నతనంలో కోర్టుకు వెళ్లినట్లు గుర్తు చేసుకున్నారు. కేసులు, న్యాయవాదులు, తీర్పులు, కక్షిదారులు తదితర వాటిపై నాన్న అవగాహన కల్పించేవారని తెలిపారు. సోదరి, తాను న్యాయవాదులుగా ఉండటంతో ప్రతి ఒక్కరూ మెచ్చుకునేవారని పేర్కొన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్నారని అభినందించేవారని అన్నారు. మరో సన్మాన గ్రహీత గొంటు అపర్ణ మాట్లాడుతూ .. గతంలో రెండుసార్లు జె.సి.జె. పరీక్షలకు హాజరయ్యానని అన్నారు. మూడోసారి పట్టుదలతో చదివి ఉత్తీర్ణత సాధించానని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గురజాల అనూరాధ, ఉపాధ్యక్షుడు బీవీ గౌరీశంకర్, ప్రభుత్వ న్యాయవాది మారెళ్ల వెంకట సుబ్బారెడ్డి, ఏపీపీ వజ్రాల రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు ఎంవీ సుబ్బారెడ్డి, యక్కలూరి కోటి లింగారెడ్డి, వణుకూరి గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా డెంగీ నిర్ధారణ పరీక్షలు

మలేరియా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథం



మలేరియా కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏటీ రామనాథం

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని గుంటూరు, తెనాలి ప్రభుత్వ వైద్యశాలల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని మలేరియా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథం సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రజలందరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంటమాలజిస్ట్ పోలు కొండారెడ్డి, ఎస్.రామచంద్రుడు, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, తెనాలి పట్టణ, మండల, గుంటూరు పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఎస్.శివ గణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, సూపర్‌వైజర్ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.58 లక్షలు



గుంటూరు వెస్ట్: ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.58 లక్షల వరకు ప్రభుత్వ నిధులు సమకూరుస్తామని, వాటిని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రగతి జిల్లా మానిటరింగ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రైతుల అభివృద్ధి కోసం, ఉత్పత్తి పెంపుదల, మార్కెటింగ్ మెరుకు సంఘాలు పనిచేయాలన్నారు. సంఘాల నాయకులతో త్వరలోనే ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల లైసెన్సులకు సంబంధించి సంఘాలకు వివరాలు అందిస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం శరత్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా హార్టికల్చర్ అధికారి రవీంద్రరావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి వీరాచారి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం డీసీఆర్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్ పోలీస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడైనా సమస్య ఉన్నట్లు తెలిస్తే, ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు, ట్రాఫిక్, మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. సైబర్ మోసాలకు గురైన బాధితుల ఫిర్యాదులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. తద్వారా వారికి త్వరగా న్యాయం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. నగదు తిరిగి బాధితులకు వచ్చేలా చూడాలని ఐటీ కోర్ సిబ్బందికి సూచించారు. విధుల్లో అలసత్వం చూపొద్దని అన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం ఇవ్వండి

తెనాలి అర్బన్: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ నాయకులు శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఈ మేరకు తెనాలిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. పరిశీలిస్తానని మనోహర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, బి.శ్రీనివాసరావు, నాయకులు జి.శ్రీనివాస్, ఏడుకొండలు, అప్పారావు, డానియేల్, శ్రీధర్, నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ ఇంటిపై టీడీపీ నాయకుల దాడి

చెరుకుపల్లి: రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకాలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. ఆస్తులను సైతం ధ్వంసం చేస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిత్యం దాడులకు పాల్పడుతూ పైశాచికానందాన్ని పొందుతున్నారు. శుక్రవారం మండలంలోని గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్ను కోటేశ్వరరావు ఇంటిపై టీడీపీ నాయకుడు కలగంటి కుమార్‌తో పాటు మరికొందరు దాడికి తెగపడ్డారు. మద్యం మత్తులో కోటేశ్వరరావు ఇంటిపై రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. అడ్డుకోబోయిన కోటేశ్వరరావు కారు డ్రైవర్ గాలి సంపత్‌కుమార్‌పై కూడా దాడికి తెగబడటంతో స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చెరుకుపల్లి ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, అల్లరిమూకల్ని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి గ్రామాన్ని వదిలి వెళ్లిన మాజీ ఎంపీపీ వారం రోజుల క్రితమే స్వగ్రామం గుళ్లపల్లి వచ్చారు.

గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: బీసీల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి సర్కారు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామ్‌గోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. సమరయోధుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని గౌతు లచ్చన్న విగ్రహ కమిటీ సభ్యులు, ఆర్‌జీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శుక్రవారం ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావులు మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరంలో అనేక పర్యాయాలు లచ్చన్న జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. వివిధ పదవుల ద్వారా ప్రజాప్రతినిధిగా విశేష సేవలు కొనసాగించారని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రావుల మణి, గాలి సుబ్బారావు, కారంకి లక్ష్మి, వేములకొండ శ్రీనివాస్, చెన్ను కుమార్, బత్తిన శంకర్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

హేతువాది కామేశ్వరబాబు కన్నుమూత



తెనాలి: పట్టణానికి చెందిన హేతువాది రామినేని కామేశ్వరబాబు (84) శుక్రవారం ఉదయం స్థానిక ఈటీ కాలనీలోని తన స్వగృహంలో కన్నుమూశారు. జల వనరుల శాఖలో యూడీసీగా ఆయన పనిచేశారు. అప్పుడు ఎక్కువకాలం విజయవాడలోనే ఉన్నారు. రిటైరైన తర్వాత విశ్రాంత జీవనం గడుపుతున్నారు. ఆయన తండ్రి అన్నపూర్ణయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. ఎంఎన్ రాయ్ అనుచరుడిగా కామేశ్వరబాబుకు పేరుంది. తన కుమారుడికి ఆయన పేరిటే మానవేంద్రరాయ్‌గా నామకరణం కూడా చేశారు. కుమారుడు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా కాగా, కుమార్తె స్వరాజ్యం జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయురాలిగా రిటైరయ్యారు. నాస్తిక ఉద్యమంలోనూ ఉన్న కామేశ్వరబాబు ఆశయం ప్రకారం ఆయన నేత్రాలను గుంటూరులోని డాక్టర్ అగర్వాల్ కంటి వైద్యశాలకు, భౌతికకాయాన్ని గన్నవరంలోని పిన్నమనేని మెడికల్ కాలేజీకి కుటుంబసభ్యులు దానం చేశారు. జనసాహితి మాస పత్రిక ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్, చైతన్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి కామేశ్వరబాబు భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

కేఎల్‌యూలో టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



ప్రసంగిస్తున్న పి.విశ్వనాథరావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎన్టీఆర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, దాముస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ర్యాంకింగ్ టోర్నీని శుక్రవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్యదర్శి పి.విశ్వనాథరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. టోర్నీలో రాష్ట్రవ్యాప్తంగా 350 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. క్రీడాకారులకు సహకారం అందిస్తామన్నారు. వర్సిటీలో క్రీడాకారులకు ఫీజు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం నేషనల్ టోర్నమెంట్ నిర్వహణకు సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, టోర్నీ కార్యనిర్వహక కార్యదర్శి వై. దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో మరో ఆరుగురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జి.వేణు	రేంజ్ వీఆర్, గుంటూరు	నెల్లూరు రూరల్ పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
షేక్.సుభాని	రేంజ్ వీఆర్, గుంటూరు	నార్త్ ట్రాఫిక్ పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
జి.రాజేశ్వరరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కావలి రూరల్ యూపీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
టి.వెంకటేశ్వర్లు	రేంజ్ వీఆర్, గుంటూరు	పొదిలి సర్కిల్, ప్రకాశం జిల్లా
ఎ.అశోక్‌కుమార్	డీసీఆర్‌బీ, పల్నాడు	ఈస్ట్ ట్రాఫిక్ పీఎస్, గుంటూరు జిల్లా
మేడా శ్రీనివాసరావు	ఇంటెలిజెన్స్	ఒంగోలు 2 టౌన్ పీఎస్, ప్రకాశం జిల్లా

పట్టుబట్టి.. కొలువు కొట్టి..!

- పోటీ పరీక్షల్లో యువతుల ప్రతిభ
- జూనియర్ సివిల్ జడ్జీలుగా నియామకం



ఆషాప్రియ



అపర్ణ

నగరంపాలెం: జూనియర్ సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి 2023లో నోటిఫికేషన్ రాగా, ఈ ఏడాది జనవరిలో ఫలితాలొచ్చాయి. అందులో గుంటూరు నగరానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. వారికి ఇతర జిల్లాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు. చిన్న వయసులో విజయం సాధించిన వారిని పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందించారు.

ప్రత్యేక శిక్షణ తీసుకోకుండానే..

గుంటూరు బాలాజీనగర్ రెండో వీధిలో ఉంటున్న మున్నంగి సాంబిరెడ్డి సీనియర్ న్యాయవాది. ఆయన భార్య నాగసుజాత చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం కె.సి.ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు. వారికి తన్మయికృష్ణ, ఆషాప్రియ సంతానం. కుమార్తెలు తండ్రి బాటలో పయనించారు. పెద్ద కుమార్తె ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇక ఆషాప్రియ జూనియర్ సివిల్ జడ్జిగా కొద్ది రోజుల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆషాప్రియ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చేబ్రోలులోని డాన్‌బాస్కో పాఠశాలలో, ఆరు నుంచి పదో తరగతి వరకు ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ఓ ప్రైవేటు కళాశాలలో చదివారు. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా కళాశాలలో 2022లో లా పూర్తిచేశారు. తండ్రి వద్దే న్యాయవాది వృత్తిలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 2023లో జూనియర్ సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశారు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే సాధన చేశారు. ఈ ఏడాది జనవరిలో తుది ఫలితాలు ప్రకటించగా, ఎనిమిదో ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఆషాప్రియను వైఎస్ఆర్ కడప జిల్లా స్పెషల్ మొబైల్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఎంతో కష్టపడి చదివి, కుమార్తె కొలువు సాధించినట్లు తండ్రి తెలిపారు. ఈ నెల 21న విధుల్లో చేరనున్నట్లు ఆయన చెప్పారు.

తండ్రి కష్టాన్ని గుర్తించి..

ప్రస్తుతం గుంటూరు ద్వారకానగర్‌లో ఉంటున్న పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన జి.అపర్ణ కర్నూలు జిల్లాలోని ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)- కమ్ -1 అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువెనైల్ కోర్టు)గా నియమితులయ్యారు. చిన్నప్పటి నుంచి అపర్ణ చదువులో రాణించారు. రెంటచింతల మండలంలోని వివేక టెక్నో స్కూల్‌లో చదవగా, పదిలో 9.3 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. గురజాలలో జేఆర్ఆర్ నవోదయ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 958 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. గుంటూరు జేకేసీ లా కళాశాలలో 2020లో కోర్సు పూర్తి చేశారు. అదే సంవత్సరంలో గుంటూరు బార్‌లో సభ్యత్వం తీసుకున్నారు. తల్లిదండ్రులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగలక్ష్మి గతంలో ప్రైవేటు ఉపాధ్యాయులుగా పని చేసేవారు. వారికి అపర్ణ, శశిధర్‌రెడ్డి సంతానం. ప్రస్తుతం తండ్రి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. కష్టపడి ఇద్దరు పిల్లలను ఉన్నతంగా చదివించారు. తనయుడు కూడా లా పూర్తి చేయగా, ప్రస్తుతం సీఏ చదువుతున్నారు. తల్లి నాగలక్ష్మి గృహిణి. అపర్ణ చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేదని తండ్రి తెలిపారు.

జీజీహెచ్‌లో జూడాల సమ్మె ఉద్ధృతం

- అత్యవసర సేవలు సైతం బహిష్కరణ
- ర్యాలీగా గుంటూరులో నిరసన ప్రదర్శన




గుంటూరు మెడికల్: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ వైద్యులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. అత్యవసర సేవలకు హాజరైన జూనియర్ వైద్యులు శుక్రవారం వాటినీ బహిష్కరించారు. తమపై దాడులు నిలువరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, తక్షణమే రక్షణ చట్టాలు అమలులోకి తీసుకురావాలన్నారు. వైద్యురాలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రోగుల సేవలు చేస్తున్న సమయంలో తమకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని చెబుతూ జూనియర్ వైద్యులు తలకు, కాళ్లకు, చేతులకు బ్యాండేజ్ కట్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నిలువరించేలా అందరూ సహకరించాలని లఘు నాటిక ప్రదర్శించారు. ఆసుపత్రి నుంచి నాజ్‌సెంటర్ మీదుగా జీజీహెచ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ వైద్యులు సైతం జూడాల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ దీక్షిత్, డాక్టర్ అన్వర్ బాషా, డాక్టర్ రవి, డాక్టర్ అశ్విని, డాక్టర్ భవిత, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి టీ10 క్రికెట్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మొట్టమొదటిసారిగా టీ10 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ పోటీలు ఉంటాయన్నారు. అండర్-14, 17, 19, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ప్రతిభకనబరచిన క్రీడాకారులను అక్టోబర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామన్నారు. పూర్తి వివరాలకు 92741 11266 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

విద్యార్థుల అద్భుత సృజన



రోబోటిక్ సైన్స్ ఎక్స్‌పో తిలకిస్తున్న డాక్టర్ నాగార్జున, డాక్టర్ కృష్ణప్రసాద్, రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన రోబోటిక్ సైన్స్ ఎక్స్‌పో విద్యార్థుల మేధస్సుకు అద్దం పట్టింది. 8 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వివిధ రకాల రోబో ఆధారిత పరికరాల వర్కింగ్ మోడల్స్‌ను రూపొందించి, ప్రదర్శించారు. విశ్రాంత కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు శ్రీనివాసరావు పర్యవేక్షణలో వారు గృహ వినియోగ, వ్యవసాయ, ఆరోగ్య, పర్యావరణ, జనరల్ అంశాలతో పాటు వివిధ శాస్త్ర, సాంకేతిక రోబోలకు సంబంధించిన 40 వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. వాటి విశేషాలను సందర్శకులకు స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి.రత్తయ్య మాట్లాడుతూ... భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధితో అన్ని రంగాలు ఆధునికత సంతరించుకుంటున్నాయని తెలిపారు. భవిష్యత్తులో అన్ని రంగాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి వాటిపై ఆధారపడనున్నాయని తెలిపారు. విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఎక్స్‌పోను వేదికగా చేశామన్నారు.